సంపుటి: 1 | సంచిక: 5

జూలై - ఆగష్టు, 2013

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



ఎవని మనస్సు నీ మీద
ఆనుకొనునో వానిని నీవు
పూర్ణశాంతిగలవానిగా
కాపాడుదువు.





# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకు శుభములు.

మీరంతా బావున్నారు కదా! ఈ సంవత్సరములో ఆరు నెలలు మనలను మన కుటుంబములను దేవుడు కాపాడి క్షేమకరమైన పరిస్థితులను అనుగ్రహించినందుకు మనము ఎల్లప్పుడు కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలయును.

సృష్టికర్త, మానవాళి జీవితాలకు ముక్తి దాత అయిన మన ప్రభువు, మనలను ఎల్లప్పుడు ప్రేమిస్తూ ఉంటాడు అనేది వాస్తవం. ఈ భూమి మీద ప్రతి ప్రేమకు హద్దులు, షరతులు ఉన్నాయి కాని ఆయన ప్రేమకు ఎటువంటి షరతులు లేవు, నిజంగా ఇది ఎంతో గొప్ప విషయము. అలాంటి అద్భుతమైన మార్గమును మనము కనుగొని ఉండుట ఎంతో ధన్యకరము.

మానవుని జీవితములో ఎక్కువ భాగం ప్రేమించబడాలి అనేది కనబడుతూ ఉంటుంది. ఈ ఆకాంక్ష వలన మానవ సంబంధములలో తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కోవడం నేటి దినములలో అధికంగా చూస్తున్నాము. కాని యేసుక్రీస్తు మానవాళి కొరకు తన్ను తాను బలిగాను, అర్పణగానూ అర్పించుకొని మనుష్యుల పాపము తనమీద వేసుకొని, వాటికి శిక్షగా సిలువ మరణం పొంది ఆయన ఎంత ప్రేమామయుడో తెలియపరిచాడు. మనము కూడా ప్రేమించబడాలి అనే ఆకాంక్షను విడిచి మన తోటి వారినందరినీ ప్రేమించుటకు ఇష్టపడిన యెడల దానిలో ఎంతో సంతోషమును మనము పొందగలము. అందుకే దేవుడు బైబిల్ గ్రంథములో పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యము అని వ్రాయించారు.

అట్టి ధన్యత దేవుడు మనకు అనుగ్రహించును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 1 | సంచిక: 5

జూలై - ఆగష్టు, 2013

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక


## ఈ సంచికలో...


- వాస్తవం ........ 2
- రెండవ గొప్ప మేల్కొవత ........ 5
- వ్యక్తిత్వం (స్త్రీల ప్రత్యేకం) ........ 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 29వ భాగము ........ 10
- ఫాదర్ గ్రేట్ (బాలల శీర్షిక) ........ 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 14
- ప్రశాంతమైన జీవితం ........ 16
- ప్రార్థనా శక్తి ........ 19
- లోయలు ........ 21
- బైబిల్ క్విజ్-29 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# వాస్తవం

- బ్రదర్. ఎపఫ్రా




క్రైస్తవుడు అనగానే గుర్తుకొచ్చేది ప్రభువైన యేసుక్రీస్తు. క్రైస్తవుడు అనగా క్రీస్తును అనుసరించి నడిచేవాడు. ఈ నవనాగరిక ప్రపంచంలో అనుసరించడం అనేది బాహ్య సంబంధమైనదిగా భావిస్తున్నాము, కానీ అనుసరించడం అనేది అంతరంగ లేక హృదయ సంబంధమైనదని గ్రహించాలి. అందుకే క్రైస్తవుడు అనే స్థానంలో నిజ క్రైస్తవుడు అని చెప్పవలసి వస్తుంది. యేసుక్రీస్తు కూడా ఒక సందర్భంలో నిజమైన ఇశ్రాయేలీయుడు అని ఒక వ్యక్తి గురించి సాక్ష్యమివ్వడం జరిగింది. పాతనిబంధనా కాలంలో నిజ ఇశ్రాయేలీయులకు సాదృశ్యమే నేటి నిజక్రైస్తవుడు. యేసు ఆ వ్యక్తిని గురించి సాక్ష్యమివ్వడానికి చూచినది కపటము లేని మనస్సు. అందుకే ఇతనిలో ఏ కపటము లేదని చెప్పడం జరిగింది. నేడు క్రైస్తవులుగా పిలువబడుతున్న వారిలో ఎంత మంది నిష్కపటంగా జీవిస్తున్నారు అని చూడగలిగితే విభ్రాంతి చెందే విషయాలు వెలుగులోకొస్తాయి. లెక్కలు చూడటం కుదరదు, కానీ లెక్కలు చూచే దినం ఒకటి ఉంది. ఆ దినము ఎదుర్కొనుటకు సిద్ధముగా ఉన్నావా?

కపటము, కపటానికి జనకుడు లోకాధికారియైన అపవాది అనగా సాతాను ఏ విధంగా లోకంలో లేక సంఘంలో కపటమును ప్రవేశపెడుతున్నాడనేది సవివరముగా మనం తెలుసుకుందాము.

**మాటలలో కపటము :-** వీటిని గురించి చెప్పుకోవలసివస్తే మన ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు చివరికి సామాన్యమైన మానవుడు కూడా మాటలలో లౌక్యం లేకుండా మనుగడ సాగించలేము అనే పరిస్థితులు నెలకొనివున్నాయి. అందుకే ఎన్నికల ముందు కపట వాగ్దానాలు, వ్యాపారసంస్థల కపట ప్రకటనలు, మనుష్యుల కపట సంభాషణలు, ఒకరిని ఒకరు మోసం చేసుకోవడం జరుగుతుంది. ఎంత కపటంతో వ్యవహరిస్తే అంత పైచేయి సాధించినట్లుగా భావిస్తున్నారు. బాధాకరమైన విషయమేమంటే, క్రైస్తవులు కూడా అదే బాటలో ప్రయాణించడం. కపట మాటల్ని గురించి బైబిల్ గ్రంథంలో సామెతలు 26:23,24 **"పగవాడు పెదవులతో మాయలు చేసి అంతరంగములో కపటము దాచుకొనును". చెడు హృదయమును, ప్రేమగా మాట్లాడు పెదవులు మంటి పెంకు మీది వెండి పూతతో సమానం.** అవి ఎన్నటికీ అతకవు.

ఒకరోజు దేవుడు ఒక వ్యక్తిని నీ తమ్ముడెక్కడ? అని అడుగుతుంటే, నా తమ్మునికి నేను కావలివాడనా? అని సమాధానం చెప్పాడు. తీరా చూస్తే తన తమ్ముణ్ణి చంపి భూమిలో

పాతిపెట్టి ఏమీ ఎరగనట్లు మాట్లాడుతున్నాడు. అతనే బైబిల్ గ్రంథంలో ఉన్న కయీను. అతడు చేసిన దానికి పర్యవసానంగా బ్రతుకుదినములన్నీ దేశదిమ్మరిగా తిరిగాడు. వంచనతో ఎక్కువ కాలము మనుగడ కొనసాగించలేము. అందుకే వంచనతో కూడిన మాటలు విడిచిపెట్టాలి.



**<u>కపట ప్రేమ –</u>** ప్రేమ అనేది సృష్టిలో ఎంతో ప్రభావవంతమైనది. ప్రతి మనుష్యుడు తాను అందరిచేత ప్రేమించబడాలి అనుకుంటాడు. ప్రేమించడం, ప్రేమించబడటం అనే అనుభూతులను మాటలతో వర్ణించలేము. అలాంటి అద్భుతమైన స్పందనలో కూడా కపటం అనేది ప్రవేశించడం ఎంతో దుఃఖకరము. ప్రేమించినట్లుగా నటించడం ద్వేషించడం కంటే దారుణమైనది. మొట్టమొదటి మనుష్యులైన ఆదాము – హవ్వలను సాతాను ప్రేమించినట్లుగా నటించి మోసగించాడు. ఎంతగా మోసగించబడ్డారంటే తన చేతులతో నిర్మించి, ప్రతిదినమూ సంభాషిస్తూ, ఎంతో ప్రేమగా చూసుకుంటున్న తమ తండ్రి అయిన దేవునిని అనుమానించే స్థితిలోకి వచ్చారు, ఎంతో ఆశ్చర్యం. కపట ప్రేమ ఎప్పుడు ఎటువంటి షరతులు విధించదు, నిజమైన ప్రేమ కొన్నిసార్లు మేలు కోరి గాయాలు చేస్తుంది. యేసు శిష్యుడైన ఇస్కరియోతు యూదాని గమనిస్తే మొదటనుండి యేసుతోనే తిరుగుతూ ఆయన శిష్యుడిగా చలామణి అవుతున్నాడు. ఒకరోజు ఒక స్త్రీ తన దగ్గరున్న ఎంతో విలువైన అత్తరుబుడ్డిని పగలగొట్టి అత్తరుతో యేసుని అభిషేకించింది. ఇది గమనించిన ఇస్కరియోతు యూదా ఈ అత్తరుని వెలకు అమ్మి బీదలకు ఇయ్యవచ్చును కదా అని బీదలమీద ప్రేమ ఉన్నట్లు నటించాడు. **"వాడీలాగు చెప్పింది బీదలమీద శ్రద్ధ కలిగి కాదు కానీ వాడు దొంగై యుండి తన దగ్గర డబ్బుసంచి ఉండినందున అందులో వేయబడిన కానుకలు దొంగిలించుచూ వచ్చెను".** (యోహాను 12:6) అని బైబిల్ గ్రంథంలో వ్రాయబడియున్నది. ఈ దినములలో మనుష్యుల మీద ప్రేమ చూపించుటలో, కనికరపడుటలో వేరొక ఉద్దేశ్యము కలిగియుండుట కపట ప్రేమై ఉన్నది.

**<u>కపట బోధకులు –</u>** కొందరు బోధకులైనవారు తాము గొప్ప స్థాయిలోకి వెళ్ళుటకు ఏది ఉన్నా, లేకపోయినా లౌకిక జ్ఞానం అవసరమని తలంచుచున్నారు. లౌక్యముతో జీవించడం కపటము అనే సంగతి అర్థం కావడం లేదు. మోసపూరితమైన మాటలు చెబుతూ మనుష్యులను మభ్యపెట్టే వారిగా ఉండటం దుఃఖకరమైన విషయం. పరలోక రాజ్యాన్ని వదులుకోవడానికైనా సిద్ధంగా ఉన్నారు కానీ తమ కపట సంఘాన్ని వదులుకోవడానికి సిద్ధంగాలేరు. బోధకులైనవారికి అపోస్తలుడైన పౌలు చెప్పిన మాటలు సవాలుతో కూడుకున్నవి. 2 కొరింథి 1:12 – **"లౌకిక జ్ఞానమును అనుసరించక, నిష్కపటమైన హృదయముతో లోకములోనూ, సంఘములోనూ నడుచుకొన్నామని మా మనస్సాక్షి సాక్ష్యమిచ్చుటే మాకున్న అతిశయమని చెప్పుచున్నాడు."** ఈ దినములలో పెద్ద మందిరం స్వయంగా

కట్టుట, ఒక గుంపును పోగుచేయుట అతిశయంగా భావిస్తున్నారు. సేవకా ! నీ అతిశయము దేనిలో?.

కపటమైన బోధలు ఎంత ప్రమాదకరమంటే, మేలును కీడుగా, కీడును మేలుగా మన కన్నులకు చూపిస్తాయి. అందుకే ప్రభువు ఒకరోజు **"మనుష్యులు కల్పించు పద్ధతులను దైవోపదేశములుగా బోధించి వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు"** (మత్తయి 15:9) అని కొందరిని గద్దించడం జరిగింది. ఉదాహరణకు చేయి ఎత్తితే చాలు రక్షించబడతారని ఆయా పథకాలలో చేరడం ద్వారా ఆశీర్వదించబడతారని, కొన్ని వారాలు చర్చికి రావడం ద్వారా దీవించబడతారు అని మనుష్యుల పద్ధతులు దైవోపదేశములుగా బోధించబడుచున్నవి. వీటి విషయమై జ్ఞానం కలిగి నడుచుకోవాలి.

కపట బోధల ద్వారా అనేకుల్ని తప్పు మార్గంలో నడిపించడమే కాక వారు కూడా దేవుని వలన కఠినమైన తీర్పును పొందబోవుచున్నారు. అందుకే యాకోబు ద్వారా దేవుడు తెలియపరచిన మాటేదనగా **"మరి కఠినమైన తీర్పు ఉందని యెరిగి మీలో అనేకులు బోధకులు కాకుండుడి "** (యాకోబు 3:1)

**కపట బోధకుల లక్షణములు కొన్ని -**

1. తమ సంఘమే పరలోకానికి చేరుతుందని బోధించుట.
2. మనుష్యులను పొగడ్తలతో ముంచెత్తుట.
3. సంఘమును ఖండించుటకు, బుద్ధి చెప్పుటకు మొహమాట పడటం.
4. క్రీస్తు శరీరమైన సంఘాన్ని వ్యాపారాత్మకంగా చూడటం.
5. సంఘాల్ని అపహాస్యాలకు నిలయంగా మార్చుట.

ప్రియమైన చదువరీ! ఇప్పటివరకు మనం ధ్యానించిన విషయాలు ఎంతో భయం కరమైనవి. అనగా నీకెన్ని వరాలున్నా, నువ్వెంతో జ్ఞానవంతుడవైనా అన్నింటిని సమర్ధ వంతంగా నడిపించగలిగిన నాయకుడివైననూ, విస్తారమైన పాలలో ఒక విషపు బొట్టు వలె, విస్తారమైన తలాంతులలో కపటమనే చిన్న విషము నీకున్న సమస్తాన్ని నష్టపరుస్తుంది. కాబట్టి మనసు మార్చుకొని యేసురక్తమును ఆశ్రయించి కపట స్వభావం నుండి నేడే విడుదల పొంది, నిజక్రైస్తవుడిగా రూపాంతరము చెందు. ఎంత కపట స్వభావంతో జీవిస్తున్నా ఆయన నిన్ను ఖచ్చితంగా విడుదల చేస్తాడు. పరిశుద్ధాత్ముడు మిమ్ములను కపటమును విడుచుటకు త్వరపెట్టునుగాక !

# రెండవ గొప్ప మేల్కొవత





1781లో చోటుచేసుకున్న అమెరికా విప్లవ వెలుగులో రాష్ట్రాలన్నిటిలో నైతిక పతనం ఉందని అనేక మంది గుర్తించారు. మద్యపానం విచ్చల విడిగా పెరిగింది. 5 మిలియన్ల జనాబాలో 3 లక్షల మంది ప్రజలు త్రాగుబోతులుగా పేర్కొనబడ్డారు. ప్రతి సంవత్సరం 15,000 మంది సమాధి చేయబడుతున్నారు. ఆ రోజుల్లోని అపవిత్రత విభ్రాంతికి గురిచేసింది. అమెరికా స్థిర పడిన తరువాత దాని చరిత్రలో మొదటి సారి స్త్రీలు దాడికి గురైతారనే భయంతో రాత్రి వేళ బయటికి వెళ్ళడానికే భయపడేవారు. బ్యాంకుల దోపిడి రోజు జరిగే అక్రమం.

ఆ రోజుల్లో సంఘాల పరిస్థితి ఏమిటి ? సంఘాల్లో సభ్యుల సంఖ్య తగ్గుముఖం పట్టి నులి వెచ్చని స్థితిలోకి జారుకున్నారు. న్యూయార్కు ప్రొటెస్టంట్ బిషపు సామ్యేల్ ప్రో గారు పని చేయడం మానేశారు. అతడు చేయాల్సిన పనికి వెలుపల ఉన్నాడు గనుక అతడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. సంఘం విడిపించలేనంత స్థాయిలోకి వెళ్ళిందని యునైటెడ్ నేషన్స్ ప్రధాన న్యాయమూర్తి జాన్ మార్షల్ గారు వర్జీనియా బిషపు జేమ్స్ మాడిసన్‌కు వ్రాశారు. మరో 30 సంవత్సరాల్లో క్రైస్తవ్యం పూర్తిగా తుడిచిపెట్టుకొని పోతుందని వాల్టేరు, థామస్‌లు ప్రకటించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన సర్వేలో మొత్తం విద్యార్థుల్లో ఒక్క

విశ్వాసి కూడా లేడని తేలింది. మరింత సువార్తీకరణ స్థలంగా పేర్కొనబడిన ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో మొత్తం విద్యార్థుల్లో ఇద్దరు మాత్రమే విశ్వాసులని తేలింది. విద్యార్థులు ఆందోళన చేసి క్రైస్తవులకు విరోధంగా ప్లే కార్డులను చేతిలో పట్టుకున్నారు. వారు ప్రిన్స్‌టన్‌లోని నాసా హాల్‌ను కాల్చి వేశారు. వారు హార్వర్డ్ అధ్యక్షున్ని బలవంతంగా రాజీనామా చేయించారు. వారు న్యూ జెర్సీలోని స్థానిక ప్రిస్బిటేరియన్ చర్చి నుండి బైబిలును తీసుకొని దాన్ని బహిరంగ భోగి మంటలో కాల్చారు.

దేశం నైతికంగా పతనమై దేవుని ప్రజల హృదయాల్లోని ఆసక్తి తగ్గిపోతుండగా 1790 దశాబ్ధంలో కొంత మంది క్రైస్తవులు మాత్రమే క్యాంపసుల్లో ఉన్నారు. వారు తీవ్రంగా ప్రార్థించడం మొదలుపెట్టారు. అప్పుడు దేవుని ఆత్మ సంచరించాడు. ప్రజల హృదయాలు మార్చబడ్డాయి. కాలనీలను ఉజ్జీవం ముంచెత్తగా వందల, వేల కొద్ది ప్రజలు దేవుని రాజ్యంలోకి వచ్చారు. ఇది రెండవ గొప్ప మేల్కొలుపు. దేవుని ప్రజలు తీవ్రంగా, ఆసక్తిగా ప్రార్థించినపుడు ఇది సంభవించింది.

నేడు సంఘాల పరిస్థితి వలన మీరు నిరాశ చెందారా? సంఘాల్లో రాజకీయాలు, విభజన, నులివెచ్చనితనం ప్రబలడం మీకు ఇబ్బందిగా ఉందా? హృదయం కలవర పడనీయకండి. ఒకవేళ మీరు తీవ్రంగా ప్రార్థించి, ఉజ్జీవం కోసం మొరపెడితే, దేవుడు ఉజ్జీవాన్ని తెచ్చి సంఘాలను స్థిరపరుస్తాడు. సంఘాలను గురించి చెడు మాట్లాడే ప్రజలు అనేకులు కానీ మార్పును చూడాలని వాటి కోసం ప్రార్థించేవారు కొందరే. మరి మీరు ఏ గుంపులో ఉంటారు?




# వ్యక్తిత్వము

వ్యక్తి యొక్క తత్త్వమును వ్యక్తిత్వము అని అంటాము. దీనిని ప్రాధమికముగా నాలుగు భాగములుగా విభజించవచ్చు. 1. బాహ్య 2.మానసిక 3.భావోద్రేక 4.సామాజిక. కొందరు బాహ్య సంబంధమైన, మరికొందరు మానసిక సంబంధమైన, భావోద్రేక మరియు సామాజిక విషయములలో నిష్ణాతులుగా కనబడవచ్చు, కానీ నాలుగు కోణాల నుండి చూచినప్పుడే ఒక వ్యక్తిని సరియైన వ్యక్తిత్వంతో ఉన్నాడని చెప్పగలము. పై నాలుగు కోణములలో సమతూకం పాటించడమే నిజమైన వ్యక్తిత్వం అవుతుంది. మానవుని దేవుడు సరియైన వ్యక్తిత్వం కలిగి జీవించాలని కోరుకున్నాడు. కాలక్రమంలో లోకవిరోధి అయిన సాతాను అనేక విధములుగా మన వ్యక్తిత్వమును పాడుచేయుచూ మనలను ఎందుకూ పనికిరానివారిగా మారుస్తున్నాడు. వాడి తంత్రములను మనము గ్రహించి, దేవుని సహాయముతో, మన ప్రయత్నం ద్వారా ఒక మంచి వ్యక్తిత్వం గలవారిగా జీవించాలి. బైబిల్ గ్రంథములో ఉన్న కొంత మంది జీవితముల ద్వారా వ్యక్తిత్వంలో ఉన్న నాలుగు భాగములను లోతుగా ధ్యానిద్దాం.

**1. బాహ్య వ్యక్తిత్వం :-**

ఒక మనుష్యుని పైరూపమును, హావభావములను చూచి చాలా బాగున్నాడు, బాగుంది, ఈ అబ్బాయి, అమ్మాయి అని అంటారు. దురదృష్టకరమైన విషయం ఏమనగా ఈ బాహ్య సౌందర్యమును చూచి జీవితములో చాలా మోసపోవుచున్నారు. కష్టపడటం తప్ప మరియొకటి తెలియని ఒక వ్యక్తి ఒకరోజు ఒక అమ్మాయి బాహ్య వ్యక్తిత్వం చూచి ఆమెతో ప్రేమలో పడ్డాడు. బాహ్య వ్యక్తిత్వం దూరంగా ఉన్నంతవరకు మాత్రమే అద్భుతంగా ఉంటుంది కానీ కలసి పనిచేయవలసి వచ్చినప్పుడు, కలసి జీవించవలసి వచ్చినప్పుడు అది ఎంత మాత్రమూ సరిపోదు. ఇద్దరు పెళ్ళి చేసుకున్నారు. అప్పుడు అతనికి అర్థమయ్యింది. ఆమె వలన ఎంత సమస్య, ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో. ఆమె పేరు రాహేలు. ఆమె కోసము 14 సం॥లు కొలువు చేయడం జరిగింది. వివాహ అనంతరం అసూయతో, చచ్చిపోతాను అనే బెదిరింపులతో తన భర్తకు నెమ్మది లేకుండా చేసింది. అంతమాత్రమే కాకుండా దొంగతనముతో తన తండ్రి ఇంట నుండి విగ్రహములను దొంగిలించి, అబద్ధములను ఆడి తన తండ్రిని మోసగించింది. ఎంత దుఃఖకరమో. వీటన్నిటిని బట్టి ఆమెకు అకాల మరణం సంభవించింది. వీటి గురించి మనము బైబిల్ గ్రంథము ఆదికాండములో చూడగలము. **రాహేలు తాను యాకోబునకు పిల్లలు కనక పోవుట చూచి**



**తన అక్కయందు అసూయపడి యాకోబుతో - నాకు గర్భఫలము నిమ్ము; లేనియెడల నేను చచ్చెదననెను. ఆది 30:1, రాహేలు ఆ విగ్రహములను తీసికొని ఒంటె సామగ్రిలో పెట్టి వాటిమీద కూర్చుండెను. కాగా లాబాను ఆ గుడారమందంతటను తడవి చూచినప్పటికిని అవి దొరకలేదు. ఆమె తన తండ్రితో - తమయెదుట నేను లేవలేనందున తాము కోపపడ కూడదు; నేను కడగానున్నానని చెప్పెను. అతడెంత వెదకినను ఆ విగ్రహములు దొరకలేదు ఆది 31:34,35.** మానవుని యొక్క వ్యక్తిత్వములో బాహ్యసంబంధమైనవి ఒక భాగమే కాని పూర్తి వ్యక్తిత్వం మాత్రము కాదు.

**2. మానసిక తత్త్వము :-**

నాలుగు రకములైన తత్త్వములలో రెండవది మానసిక తత్త్వము. మనస్సు నందు కలిగే ఆలోచనలు, ధ్యానములు మన జీవితమును ఇతరులతో కలిసి మెలసి జీవించడానికి మరియు దేవుని యెడల భక్తి కలిగి బ్రతకడానికి ఉపయోగపడతాయి. ఒక సమాధానకరమైన సమాజం ఉండాలి అంటే మానసిక తత్త్వము ఎంతో మంచిదై ఉండాలి దానిని మనుష్యులు ఎవ్వరూ చూడలేరు కాని, మన క్రియలు మన తత్త్వమును గూర్చి సాక్ష్యం ఇస్తాయి.

కొందరు బాహ్యరూపమునకు చక్కగా ఉండవచ్చు, మాటలు కూడా ఎదుటివారిని కట్టి పడవేసేవిగా ఉన్నప్పటికి మనస్సులో కలిగి ఉన్న కపటము, ధనాపేక్ష, వేషధారణ వారి వ్యక్తిత్వమునకు ఎంతో నష్టమును కలిగిస్తాయి.

బైబిల్ క్రొత్త నిబంధనలో మొట్టమొదటి సంఘమైన ఆది సంఘములో సభ్యులైన వారందరూ ఏకహృదయం, ఏకాత్మ కలిగి జీవిస్తూ ఉన్నారు. అలాంటి సమయములో వారందరికి ఒక ఆలోచన కలిగింది. వారికి కలిగిన ఆస్తులన్నింటిని పేతురు అనే వ్యక్తి దగ్గర పెట్టి వారు సమిష్ఠిగా జీవించాలని నిర్ణయించుకొని, సమస్త స్థిర చరాస్తులు అమ్మివేసి పేతురు పాదముల యొద్ద పెట్టారు. సప్పీరా తన భర్త అయిన అననీయ అను ఇద్దరూ కలిసి అమ్మిన ధనములో కొంత దాచుకొని వారందరి మధ్యలోనికి సమస్తమును ఇచ్చిన వారి వలె వచ్చారు. ఎంత చెడ్డ మనస్తత్త్వము.

భార్య యెరుకనే వాడు దాని వెలలో కొంత దాచుకొని కొంత తెచ్చి అపోస్తలుల పాదముల యొద్ద పెట్టెను. అప్పుడు పేతురు అననీయా, నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను ? అది నీ యొద్ద నున్నప్పుడు నీదే గదా? అమ్మిన పిమ్మట అది నీ వశమై యుండలేదా? అననీయా ఈ మాటలు వినుచునే పడి ప్రాణము విడువగా వినిన వారికందరికి మిగుల భయము కలిగెను ఇంచు మించు మూడు గంటల సేపటికి వాని భార్య జరిగినది ఎరుగక లోపలికి వచ్చెను. అప్పుడు పేతురు - మీరు ఆ భూమిని ఇంతకే అమ్మితిరా నాతో చెప్పుమని ఆమెను అడిగెను. అందుకామె - అవును ఇంతకే అని చెప్పెను. అందుకు పేతురు - ప్రభువు యొక్క ఆత్మను శోధించుటకు మీరెందుకు ఏకీభవించితిరి. వెంటనే ఆమె అతడి పాదముల యొద్ద పడి ప్రాణము విడిచెను. అపో॥కా 5:2-10



దాని వలన వారిద్దరూ దేవుని ఉగ్రత చూచినారు. అక్కడే పడి ప్రాణము విడిచారు. వ్యక్తిత్వములో రెండవది, ప్రధానమైనది మానసిక తత్త్వము. దాని విషయములో మనం జాగ్రత్తగా జీవిద్దాము. మిగిలిన రెండు తత్త్వములను గూర్చి తరువాతి సంచికలో ధ్యానించుకుందాము.

మిమ్ములను, మీ పిల్లలను దేవుడు సరియైన వ్యక్తిత్వముతో నడిపించును గాక !


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు

వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,

ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.

అందరూ ఆహ్వానితులే....!

వివరములకు:

9666666249 | 040-24202227



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 29వ భాగము**

డే్రహ్రాడూన్‌కు వెళ్ళుచూ మార్గములో ఓ రోమన్ కథోలిక్ డాక్టర్‌ను కలిసికొని తన ఉద్దేశ్యమును తెలియజేశాడు. అలాంటి ఉపవాసములు చేయవద్దని సుందర్‌కు నచ్చచెప్పడానికి అతడు ఎంతో ప్రయత్నించాడు. చనిపోతావని హెచ్చరించాడు. అయితే సుందర్ ఈ విషయములో స్థిర చిత్తముతో ఉండడం వలన మీకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే తెలియజేయడానికి మీ స్నేహితులలో కొందరి పేర్లు చిరునామాలు ఇవ్వమన్నప్పుడు సుందర్ దానికి అంగీకరించాడు. ఆ తరువాత అరణ్యం లోపలికి వెళ్ళాడు. దీర్ఘకాలం ఉపవాసముండడం వలన జరిగే పరిణామములను వివరించి రోజుకు ఒక రాయి విసిరి పారవేస్తున్నట్లైతే ఎన్ని రోజులు గడిచిందీ తెలుసుకోవడానికి గుర్తుంటుందని చెప్పాడు డాక్టర్. కాబట్టి క్రొత్త నిబంధనను, 40 రాళ్ళను తీసుకొని ఆ అడవిలోకి పోయి తన ఉపవాస ధ్యానమారంభించాడు. మొదటి కొద్దిరోజులు శరీరమునకు ఎంతో కష్టమనిపించింది. ఆకలి వలన కడుపు నొప్పి వచ్చి ఎంతో తీవ్రమైపోయింది. అయితే కొద్దిరోజులలోనే అది తగ్గిపోయింది గాని సుందర్ అంతకంతకు బలహీనుడై పోనారంభించాడు. రోజుకో రాయి ప్రక్కకు పెట్టడం కూడా కష్టమైపోయింది. ఒకరోజు ఒక క్రూరమృగం తన దగ్గర్లోనే ఘర్జించడం విన్నాడు కాని దానిని సరిగా గుర్తించలేకపోయాడు. భౌతిక జ్ఞానేంద్రియములు బలహీనమై పోవడంతో పరలోకము దేవుని సన్నిధిని గూర్చిన గ్రహింపు అంతకంతకు ఎక్కువైపోనారంభించింది. తాను క్రీస్తువైపు తిరిగినపుడు దొరికిన లోతైన సంతోషము, సమాధానము వృద్ధి చెందసాగాయి. ఆ ఉపవాసము మానివేయాలనిపించలేదు సుందర్‌కు. ఆ సమయములో అతని శరీరం బలహీనమైపోయి, అలసట చెందినది. అయితే దీని ప్రతిఫలంగా క్రీస్తు యొక్క నూతన దర్శన భాగ్యం కలిగింది.

మరపురాని ఆ రాత్రి కలిగిన దర్శనములో పునరుత్థానుడైన యేసుక్రీస్తును కళ్ళారా చూచాడు. తన మహిమలో సింహాసనాసీనుడైన మనుష్యకుమారుని దర్శనం కలిగింది. ఆయన ముఖం దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది. ఆయన పాద హస్తములలోని గాయములు తేటగా కనబడుచుండినా అవెంతో సౌందర్యముగా ఉన్నాయి. ఆ దర్శనమును వర్ణించలేము.

ఏమైనప్పటికిని ఈ భూలోకములో తాను చేయవలసినది ఇంకా ఉన్నదని అంతవరకు అతడు సజీవంగా కాపాడబడతాడని సుందర్‌కు బయలుపరచబడింది. ఆ తరువాత స్పృహ కోల్పోయాడు సుందర్.

అప్పుడే అందిన టెలిగ్రాం చదివి బిషప్ లెఫ్రాయ్‌గారు నిశ్చేష్ఠుడైపోయారు. సుందర్‌సింగ్ చనిపోయాడని దాని సారాశం. తన ఆరోగ్యం బాగాలేదని ఒక స్నేహితునితో ఉండడానికి వెళ్తున్నానంటూ కొద్ది వారముల క్రితమే లెఫ్రాయ్‌గారికి ఉత్తరం వ్రాశాడు సుందర్. అప్పటి నుండి అతని నుండి ఇంకెలాంటి సమాచారము అందలేదు. సిమ్లాలోని రెవ.జె.రెడ్‌మాన్, లూధియానాలోని డా.ఇ.ఎమ్.వెర్రీ, లాహోర్‌లోని కానన్ విగ్రాంలతో బాటు మరో ఇద్దరు సంఘ పరిచారకులు కూడా ఇలాంటి తంతి వార్తనే అందుకున్నారు. ఆ తంతి పంపినది స్మిత్ అని తప్ప మరి ఎలాంటి వివరములు తెలియలేదు. ఏమైనప్పటికిని ఆ తంతి సందేశమును సందేహించడానికి ఎలాంటి ఆస్కారము వారికి కనబడలేదు. ఈ తంతి ఎక్కడ నుండి పంపించారో తెలిసికోవడానికై విచారించినప్పుడు నల్లటి కోటు ధరించిన ఓ పెద్ద మనిషి దీనిని పంపించాడని తెలిసింది. సుందర్ జీవిత విధానమును గమనిస్తే ఆయనకి ఏ ప్రమాదమైనా సంభవించవచ్చుననేది తేటపడుచున్నది.

యౌవన సాధువు చనిపోయాడు అన్న సమాచారంతో మిషనెరీలు మాత్రమే గాక, సుందర్‌ని ఎరిగిన క్రైస్తవ సంఘములన్నీ అతని మరణమును క్రైస్తవ ప్రపంచమునకు తీరని లోటుగా భావించారు. భారతదేశంలో క్రైస్తవులుగా మారిన వారి పద్ధతులను అతడు అనుసరించకపోయిననూ అతని సాటిలేని జీవితమును అనన్యమైన రీతిగా అతడు సువార్తనందించే విధానం వలన అది ఎందరి మీదనో గట్టి ప్రభావమును చూపడాన్ని వారు గుర్తించక పోలేదు. అయితే వీటన్నింటికి మించి ఒక వ్యక్తిగా వారందరికి అతడు ఎంతో ప్రియమైన వాడయ్యాడు.

సేకరించబడింది



# ఫాదర్ గ్రేట్

హాయ్ పిల్లలూ! చాలా Busyగా ఉన్నారా? స్కూల్స్ స్టార్ట్ అయ్యాయి కదా! కొత్త క్లాసెస్ శ్రద్ధగా వింటున్నారా? కొత్త స్కూల్స్‌లో జాయిన్ అయ్యారా? అక్కడ ఎలాంటి వారితో స్నేహం చేయాలో "మూర్ఖునితో చెలిమి" స్టోరీ ద్వారా తెలుసుకున్నారు కదా! జాగ్రత్తగా స్నేహితులను నిర్ణయించుకొని మీ స్టడీస్‌లో ముందుకు వెళ్ళండి. మీ పరిస్థితులు ఎటువంటివి అయినా అంటే... చదువు కోవడానికి ఆర్థిక సహాయం లేకపోతే దేవున్ని వేడుకోవటం, అనుకూల పరిస్థితులు ఉంటే దేవుని స్తుతించటం అలవాటు చేసుకోవాలని ప్రోత్సాహపరుస్తున్నాను. మిమ్మల్ని పేరెంట్స్ ప్రేయర్ చేసుకోమంటే నిర్లక్ష్యంగా ఉండకండి. పెద్దవాళ్ళు అనేకసార్లు చెప్పేవి అన్నీ మీ మంచికే. ఇప్పుడు మీరు టీచర్స్, పేరెంట్స్ చెప్పినట్లు వింటే పెద్దయ్యాక మంచి వ్యక్తిత్వం కలిగినవారుగా తీర్చిదిద్దబడతారు. వారిని బాధ పెట్టకండి, కొంతమంది పిల్లలకి సరియైన మార్గం చూపించే వారు లేక చెడ్డవారుగా తయారవుతున్నారు.

జార్జ్ అనే బాలుడు తన తల్లిదండ్రులను పోగొట్టుకొని అనాథ అయ్యాడు. 12 సం॥ల వయస్సులోనే అల్లరి మూకలకు నాయకుడిగా ఎదిగాడు. అతని గ్రూప్‌లోని పిల్లలందరూ జార్జ్ కంటే వయస్సులో పెద్దవారు. 16 సం॥ల పిల్లలు కూడా జార్జ్‌ని తమ నాయకునిగా అంగీకరించారు. జార్జ్ హత్యలు చేసేవాడు, చిన్న pistolతో మిఠాయి దుకాణాలను బెదిరించి దోచుకునేవాడు, ఒంటరిగా ఒక బ్యాంకును కొల్లగొట్టి లక్షలాది రూపాయలు సంపాదించాడు, ఒక మారు ఒక ముసలమ్మను చంపేందుకు pistol సర్దుకుంటుండగా పోలీసులకు చిక్కాడు. బాలనేరస్థుల cell లో అతనిని వేశారు. అక్కడి పిల్లలకి ఒక school, hostel వసతులు కలవు. ఆండ్రూస్ అనే ఫాదర్ అక్కడి పిల్లలకి మంచి మాటలు చెప్పి, వారి చెడ్డ ప్రవర్తనను మార్చుకోడానికి ప్రోత్సాహాన్ని ఇచ్చేవాడు. జార్జ్‌కి పోలీసుల భయంలేదు, ఇష్టం వచ్చినట్లు తిరిగేవాడు, తన దర్పాన్ని చూపేవాడు, దొరికిన వస్తువులన్నీ చెల్లాచెదురుగా విసిరివేసేవాడు. తరగతిలోని విద్యార్థులను తిడుతుండేవాడు. తోటి విద్యార్థులు గంటల తరబడి శ్రమించి చేసిన మంచి పనులను నిమిషంలో పాడుచేసేవాడు. వీటన్నిటిని ఆ ఫాదర్ ఎంతో ఓరిమితో సహిస్తూ ఉండేవాడు. స్కూల్లో చేరిన 6 నెలలు జార్జ్ ముఖంలో చిరునవ్వు కానీ, కన్నీరు కానీ ఎవ్వరూ చూడలేదు.

ఈ విధంగా నిలువెల్ల ద్వేషాన్ని పెంచుకున్న జార్జ్‌తో school లోని teachers అందరూ విసుగెత్తిపోయారు. వారు ఫాదర్‌తో జార్జ్ గురించి "ఫాదర్‌గారు మీరు ప్రపంచంలో చెడ్డవారు ఎవరూ ఉండరని చెబుతారు కదా మరి జార్జ్ చెడ్డవాడు కాదంటారా? మీరు అతని గూర్చి ఏమి చెబుతారు?" అని అడిగారు. ఫాదర్ మౌనంగా ఉన్నాడు.

ఒక రాత్రి జార్జ్ నిద్రలో కలవరిస్తున్నాడు, ఫాదర్ అతన్ని చూశాడు. తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్నాడు. జార్జ్ దుష్ట స్వభావంతో హింసించిన తోటి విద్యార్థులు, అతనికి సేవ చేసి కంటికి రెప్పలా కాపాడారు. జార్జ్ తొందరగానే కోలుకున్నాడు. కానీ అతని ముఖంలో కృతజ్ఞతకు సూచనగా ఒక్క చిరునవ్వు కూడా మినుక్కుమనలేదు. ఒకరోజు జార్జ్ నేరుగా ఫాదర్ దగ్గరకు వెళ్ళి "మీరు నన్ను మంచివాడిగా మార్చాలని ప్రయత్నిస్తున్నారు", అది ఎంత వరకు సాధ్యం. ఇంతకు ముందే నేను ఒక సిస్టర్‌ని కొట్టి వచ్చాను. దానికి మీరేమంటారు? అని అడిగాడు. ఇప్పటికీ చెబుతున్నాను నీవు మంచి బాలుడివే అని దృఢంగా చెప్పాడు ఫాదర్. నేను మంచివాడిని కాదని మీకు బాగా తెలుసు, కానీ మంచి వాడినని అబద్ధం చెబుతున్నారు. ఫాదర్ ఒక్క క్షణం ఆలోచించి మంచి బాలుడు ఎలా ఉంటాడు? పెద్దల పట్ల విధేయుడిగా, ఉపాధ్యాయులు చెప్పినట్లు వింటాడు కదా అన్నాడు ఫాదర్. అవును అన్నాడు జార్జ్.

నువ్వు మొదట పెరిగిన పరిస్థితులు, నీతో స్నేహం చేసే తుంటరి పిల్లలు నీకు మాదిరిగా ఉండుట ద్వారా, చెడు మార్గములను అనుసరిస్తూ, చెడు చేయటమే గొప్ప విజయము అనుకున్నావు. ఇప్పుడు ఇక్కడ మంచి పిల్లలతో స్నేహం చేస్తూ, ఉపాధ్యాయులకి విధేయుడిగా జీవిస్తే, అత్యుత్తమ వ్యక్తివి కాగలవు అన్నారు ఫాదర్. ఈ మాట అతని మనస్సులో చెరగని ముద్ర వేసింది. ఫాదర్ మాట వాస్తవమనిపించింది. చెడ్డవాడ్ని అని అతనిలో నాటుకున్న నమ్మకమును తొలగించింది. కొన్ని దినములలోనే జార్జ్ పరీక్షల్లో మొదటి స్థానాన్ని సంపాదించాడు. సైన్యంలో చేరి, యుద్ధంలో పాల్గొని చాలా పతకాలు అందుకున్నాడు. మంచి వ్యక్తిగా పేరుగాంచాడు.

ఈ రోజుల్లో సమాజానికి కావలసింది ఒక రెవరెండ్, బిషప్, పాస్టరు కాదు, ఫాదర్ ఆంద్రూస్ లాంటి వ్యక్తి. చూశారా పిల్లలూ! ఏ ఒక్కరినీ దేవుడు చెడ్డవారిగా సృష్టించడు. మన చుట్టూ ఉన్న పరిస్థితులను, మనుష్యులను బట్టి చెడ్డ వారిగా మారుతూ ఉంటాము. జార్జ్ పరిస్థితుల నుండి బయటికి రావడానికి చాలా time పట్టింది. కాబట్టి మీరు అటువంటి పరిస్థితులు రానీయక మీ పెద్దవారు చెప్పినట్లుగా వినండి, బాగా చదువుకోండి. మంచి పిల్లలుగా పేరు తెచ్చుకుంటారుగా ..........

God bless you.

– మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

**ఇస్సాకు, కానూరు**

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికి వందనములు. నా పేరు ఇస్సాకు. మాది భయంకరమైన విగ్రహారాధన కుటుంబము. ప్రతి సంవత్సరం విగ్రహారాధనకు సంబంధించిన మాలలు ధరించుకొని, ఆ కొద్ది దినములు మాత్రం త్రాగకుండా చాలా నిష్ఠగా ఉండేవాడిని. మరల అవి తీసివేసిన వెంటనే యధావిధిగా త్రాగేవాడిని. నాకు మొదటిసారిగా పాప పుట్టింది. అబ్బాయి పుట్టాలి అనుకునేవాడిని కాని నాకు రెండవసారి కూడా పాపే పుట్టింది. మూడవసారి బాబు కావాలనే ఆశతో పూజలు చేసేవాడిని. బాబు పుడతాడని పూజలు చేయించిన పెద్దలు అందరూ చెప్పారు. నేను వాటన్నిటిని చాలా నమ్మి బాబు పుడతాడు అనే నమ్మకంతో ఉన్నాను కానీ మరల పాపే పుట్టడంతో ఇంట్లో ఉన్న విగ్రహారాధన ఫోటోలన్నీ తీసి బయటికి విసిరివేసి, పూజలు చేయడం మానివేసాను. ఇటు పూజలు, ప్రార్థన ఏమీ లేకుండా, ఎక్కడికి వెళ్ళకుండా ఉండేవాడిని. తరువాత మా పిల్లలు ప్రతి ఆదివారం ఇంటి ముందు పిల్లలతో కలిసి సండేస్కూల్‌కి వెళ్ళడంతో ఆ చర్చిలో వాళ్ళు మా ఇంటికి అప్పుడప్పుడూ వచ్చి, ప్రార్థన చేసి, చర్చికి రమ్మని చెప్పేవారు. ఆ విధంగా నేను కొంచెం మారాను. కాని నా భార్య పూజలు చేయడం మానలేదు. అలానే పూజలు చేస్తూ ఉండేది. తరువాత వాళ్ళ అన్నయ్య చనిపోవడంతో పూజలు మానేసింది కానీ చర్చికి కూడా వెళ్ళేది కాదు. చాలా రోజుల తరువాత తను కూడా తెలుసుకొని చర్చికి వెళ్తూ ఉండేది. ఆ విధంగా మేము దేవుణ్ని తెలుసుకొని, ప్రార్థన చేసుకుంటూ ఉండేవారము. ఇలా ఉండగా నాకు ముగ్గురూ ఆడపిల్లలే అని ఒకతను కువైట్ వెళ్ళమని సలహా ఇచ్చారు. సరే కదా వెళ్దాం అని నేను డబ్బు అప్పు తెచ్చి ఒక ఏజెంటెకి ఇచ్చాను. అతను నన్ను కువైట్ తీసుకొని వెళ్తా అని చెప్పి 3 సంవత్సరములు బొంబాయి త్రిప్పాడు కానీ కువైట్ వరకు పంపనేలేదు. ఒకసారి బొంబాయిలోనే వదిలేసాడు. అప్పుడు అక్కడే పనిచేసి, ఆ డబ్బులతో తిరిగి మరల ఊరికి వచ్చేశాను. ఇలా నేను 3 సంవత్సరములు బొంబాయికి, ఊరికి తిరగడం వలన, ఇల్లు గడవక తినడానికి కూడా ఏమీ ఉండేది కాదు. మా ఇంటి ఎదురుగా ఇద్దరు వృద్ధులు ఉండేవారు. మా ఇంట్లో తినడానికి ఏమీ లేనప్పుడు దేవునికి ప్రార్థన చేసుకున్నప్పుడు ఆ ఇద్దరు వృద్ధులే సహాయం చేసేవారు. నేను ఊర్లో లేనప్పుడు కూడా అవసరమునకు డబ్బులు కూడా వాళ్ళే ఇచ్చేవారు. ఇంక నేను ఖాళీగా తిరగడం వలన 2 లక్షల అప్పు అయ్యాము. ఉన్న ఇల్లు అమ్మేసి కొంచెం అప్పు తీర్చాము. నా అన్నదమ్ములు కూడా నేను అప్పుల్లో ఉన్నానని ఏమీ పట్టించుకునే వారు కారు. ఈ అప్పుల వలన హైదరాబాద్‌లో ఉన్న అన్నయ్య, వదిన ద్వారా ఇక్కడికి వచ్చాము. ఇక్కడికి వచ్చిన తరువాత మేము ముందు వేరే పరిచర్యకి

వెళ్ళేవారము కాని సమాధానమేమి ఉండేది కాదు ఎన్నో ఇబ్బందులు పడ్డాము. తరువాత ఆ పరిచర్య నుండి తప్పుకోవాలని అనుకొని మానేశాము. కొన్ని వారములు ఎక్కడికి వెళ్ళకుండా ఇంట్లోనే ఉన్నాము. అప్పట్లో నా భార్య పాపడ్ పేకెట్స్ సేల్ చేసేది. మన పరిచర్యలోనే ఉన్న ఒక సహోదరికి ఆ పాకెట్స్ ఇస్తూ ఉండేది. వాళ్ళు చర్చి క్రింద ఉండడంతో శనివారం రోజు వెళ్ళినప్పుడెల్లా ఆ వాక్యం ఉన్నంతసేపు వినేది, ఆ విధంగా మన పరిచర్యకి రావడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటి వరకు దేవునిలో ఎలా ఉండాలి, ఎలా జీవించాలి అనేది నేర్చుకుంటూ ఉన్నాము. అలాగే మా పిల్లలను కూడా ఎక్కువ చదివించవద్దు అనుకున్నాము, కానీ దైవజనుల ప్రోత్సాహం వలన వాళ్ళని చక్కగా చదివించగలిగాము. ఇదంతా దేవుని కృప వలన మాత్రమే మేము చేయగలిగాము. ఇదే విధంగా చివరి శ్వాస వరకు పరిచర్యలో నమ్మకంగా నిలిచి ఉండాలి అనేది మా ఆశ.

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# ప్రశాంతమైన జీవితం

మన మనస్తత్వపు విధానములో కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రశాంతమైన జీవితమును జీవించడానికి అవకాశం ఉంటుంది. ఇప్పుడు కొన్ని మస్తత్వపు విధానములను ధ్యానించుకుందాము.

**1. అనవసర జోక్యము :-**

మనకు సంబంధం లేని విషయములలో జోక్యం చేసుకొని మనకి మనమే సమస్యలని సృష్టించుకుంటాము. మన ఆలోచనలకు తగినట్లుగా ఎదుటి వారు ఉండాలని భావిస్తాము. వారు మనకి నచ్చినట్లుగా ఉండకపోతే మార్చాలనే ప్రయత్నం చేస్తూ, భంగపడుతూ ఉంటాము. ఏ ఇద్దరు మనుష్యులు ఒకే విధంగా జీవించలేరు. దేవుడు మనందర్నీ ఒక్కరిగా సృష్టించలేదు కానీ ఒక్కొక్కరిని ప్రత్యేకమైన వ్యక్తిత్వముతో సృష్టించారు. ఉదాహరణకు ప్రతి మనుష్యుడు ఏదో ఒక రంగు ఇష్టపడుతూ ఉంటాడు. తాను వినియోగించే వస్తువులలో ఒకరి ఇష్టానికి, మరొకరి ఇష్టానికి మధ్య వ్యత్యాసముంటుంది కానీ ఎక్కువమంది తమకు నచ్చిన రంగు లేక వస్తువు ఎదుటి వారికి కూడా నచ్చాలని భావిస్తారు. బలవంతంగా మరియు వాక్చాతుర్యముతో వారి ఇష్టాలను ఎదుటి వారి మీద రుద్దుతారు. తద్వారా కలిగే అభిప్రాయ భేదాల వలన ప్రశాంతమైన జీవితమునకు ఆటంకము కలుగుతుంది. కనుక ప్రతివారూ ఎదుటివారి ఇష్టాయిష్టాలను, వ్యక్తిత్వమును గౌరవిస్తూ, పొరుగువారి విషయములో అనవసరమైన జోక్యమును నియంత్రించుకొని జీవించాలి.

**2. క్షమించుట మరియు మరచిపోవుట :-**

ఈ మనస్తత్వము శక్తివంతమైన ఆయుధము, మనలను నిందించి, అవమానపరిచి కీడు చేసిన వారిని గురించి ఎన్నో చెడ్డ అభిప్రాయములను హృదయంలో కలిగి జీవిస్తూ ఉంటాము. వాటిని గుర్తు పెట్టుకొని, పదే పదే జ్ఞాపకం తెచ్చుకోవడం వలన నిద్రలేమి తద్వారా అధిక రక్తపోటు, కడుపులో మంటలు వంటి అనారోగ్యములు కలగడానికి అవకాశముంటుంది. ఇవి మన చేతులారా మనమే కొని తెచ్చుకుంటున్నాము. క్షమించుట అనే విషయం పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో ఎంతో ప్రాముఖ్యమైనదిగా కనబడుతుంది. ప్రభువైన యేసుక్రీస్తు తన బోధలలో క్షమించుడి అప్పుడు మీరు క్షమించబడుదురు, క్షమింపకపోయిన యెడల మీరు కూడా క్షమించబడరు అని హెచ్చరించుట జరిగింది. ఎంతో విలువ కలిగిన చిన్న జీవితములో ఇటువంటి వ్యర్థమైన చెడు అభిప్రాయములను విడిచిపెట్టి, క్షమించుట మరియు మరచిపోవుట అనే ఆయుధమును సాధకం చేసికొనుట ద్వారా హృదయంలో ప్రశాంతతను కాపాడుకుంటాము.

**3. మన భావోద్రేకములను నియంత్రించుకొనుట:–**

మనకి నచ్చని పనులు చేస్తున్నప్పుడు లేక మన హృదయములను ఎవరైనా గాయపరిచినప్పుడు మన హృదయంలో కలిగే ఆలోచనలను వ్యక్తపరచడం భావోద్రేకములు. భావోద్రేకములు లేని మనుష్యులంటూ ఎవరూ ఉండరు. కానీ అవి నియంత్రణలో లేకపోతే మాత్రం ప్రశాంతమైన జీవితమును కోల్పోతాము. అనేక కుటుంబములలో అశాంతికి కారణం భావోద్రేకములను నియంత్రించుకోకపోవడం. అందుకే క్షణికావేశంతో తమకు ప్రియమైన వారిని చంపి, జీవితకాలమంతా దుఃఖిస్తూ ఉంటారు. దీనికి కారణం తమ ఉద్రేకముల మీద నియంత్రణ లేకపోవడం. మన జీవితంలో కలుగుచున్న భావోద్రేకములను నియంత్రించుకోవడం ద్వారా మనం ప్రశాంతమైన జీవితమును జీవించగలము.

**4. అనుమానం :–**

అనుమానం పెనుభూతం అనేది మన పెద్దల నానుడి. అనుమానం అనే విషయమును లోతుగా అధ్యయనం చేస్తే ఇది వ్యాధిగా కనిపించని భయంకరమైన వ్యాధి. దీని కంటే నాశనకరమైన వ్యాధి మరొకటి లేదు అనేది వాస్తవమైన విషయం. ఈ భూమి మీద ఉన్న ప్రతి వ్యాధి వ్యాధిగ్రస్తుణ్ని మాత్రమే కబళిస్తుంది కానీ అనుమానం అనే వ్యాధి కలిగిన ఒక వ్యక్తి ద్వారా అనేక మంది జీవితములు నాశనం అవుతాయి. “ఊహలన్నీ నిజాలు కావు, నిజాలన్నీ ఊహించలేము” కానీ మనుష్యుడు తన ఊహలన్నీ నిజాలుగా భావించుకొని, తప్పుడు మార్గములలో వెళ్ళిపోతూ ఉంటాడు. అనుమానించుటకు నిదానించు వారిగాను, నమ్ముటకు వేగిరపడువారిగాను ఉండాలి. అనుమానించుటను స్వార్థంతో కూడా పోల్చవచ్చును, ఎలాగంటే దేవుని చేతులతో నిర్మించబడిన ఆదాము, అతని భార్యయైన హవ్వ, వారు ఏదేను తోటలో సాతాను స్వరము వింటున్నప్పుడు, దేవునిని అనుమానించడానికి కారణము నేను దేవతని అవుతాను, చూడటానికి ఆ పండు చాలా చక్కగా ఉంది, తింటే ఇంకెంత బాగుంటుందో అనే స్వార్థపూరితమైన ఆలోచనలే. వీటన్నిటి ఫలితం దేవుని నుండి దూరమై ఆదాము, హవ్వలు వారి సంతానము సంవత్సరాలు సంవత్సరాలుగా అనుభవిస్తున్న భయంకరమైన శాపము. అనుమానం వలన కలిగే నష్టము నివారించడం చాలాసార్లు సాధ్యం కాదు. కనుక జీవితంలో అనుమానించడానికి ఎంత మాత్రమూ సాహసించకూడదు.

భార్యాభర్తలు, స్నేహితులు, వ్యాపార భాగస్వాములు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, తల్లిదండ్రులు, పిల్లలు ఏ సంబంధముల మధ్య చూచినా అనుమానం అనే ఒత్తిడి బలంగా పనిచేస్తుంది. ఏ మనుష్యుడు తాను కలిగి ఉన్న ప్రతి సంబంధ బాంధవ్యములలో అనుమానం అనే దానికి అవకాశం లేకుండా జీవిస్తాడో అతడు ప్రశాంతమైన జీవితమును జీవించగలడు.

**5. గుర్తింపు కొరకు ప్రాకులాడవద్దు :-**

సాధారణముగా మానవుని జీవితంలో తమను అందరూ గుర్తించాలని భావిస్తూ ఉంటారు. తాము కలిగి ఉన్న అంచనాల ప్రకారం జరగనప్పుడు ఎంతో నిరుత్సాహపడడం కనబడుతుంది. అందుకే మనం గుర్తింపుని ఆశించనప్పుడు ప్రతి పరిస్థితిలోనూ సంతోషంగా ఉండగలుగుతాము. గుర్తింపబడుట అనేది, దాని కొరకు ప్రాకులాడుట వలన దొరికేది కాదు. ఈ విషయంలో అనేకులు గ్రహింపు లేకుండా, ప్రవర్తిస్తూ ఉంటారు. పేరు ప్రఖ్యాతులు గలవారితో ఉంటూ, అందరిలో గుర్తింపు పొందాలని ప్రయత్నిస్తారు. నిజమైన గుర్తింపు మన బాధ్యతను మనం సక్రమంగా నిర్వర్తించడం వలన వస్తుంది. కానీ దీనిని అనేకులు గుర్తించక, దగ్గర దారులను వెతుక్కుంటున్నారు. నేటి దినములలో ఇటువంటి నైజము వ్యక్తులలోనే కాక, సంస్థలలోనూ కనబడుచున్నది. వార్తలను ప్రచురించే టి.వి ఛానల్స్ చూస్తే గుర్తింపు కొరకు ఎన్నో అవాస్తవములను వాస్తవములుగా చూపిస్తూ ఉంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే సరిగా విషయము తెలుసుకోకుండా, అంతమంది చనిపోయారు, ఇంతమంది చనిపోయారు అని ప్రకటిస్తూ ఉంటారు. ఇదంతా కేవలం అందరి దృష్టిలోనూ ముందుగా ప్రకటించాము అని గుర్తింపు పొందుట కొరకే. ఈ విధంగా వ్యవస్థలో అనేక విధములుగా గుర్తింపు కొరకు ప్రాకులాడి, వారు నష్టపోతూ, అనేకులను నష్టపరుస్తూ ఉంటారు. తద్వారా ప్రశాంతమైన జీవితమును పోగొట్టుకుంటారు.

**6.అసూయపడవద్దు :-**

అసూయ అనగా ఎదుటి వారి గుణముల మీద దోషం ఆరోపించుట. తోటి వారి స్థితిని సహించుకోలేకపోవడం అసూయ పడడం అవుతుంది. అనేకసార్లు మన తోటి వారిని, మన కంటే తక్కువ స్థితిలో ఉన్నవారిని, మన కంటే మెరుగైన స్థితిలో చూడలేక పోవడం జరుగుతుంది. కాని మనం ఎవరి యెడల అసూయ పడినప్పటికి ఎటువంటి లాభమును పొందలేము. లాభమును పొందకపోగా మన హృదయంలో ఒక విధమైన ఒత్తిడి ప్రారంభమవుతుంది. అది మనకి ఎంతో నష్టమును కలిగిస్తుంది. అసూయ కలగడానికి కారణం మనలను ఇతరులతో పోల్చుకొనుట. చరిత్రలో ఏ ఇద్దరు వ్యక్తులు ఒకే విధంగా ఉండలేరు, భవిష్యత్‌లో కూడా ఉండబోరు. కాబట్టి పోల్చుకొనుటకు అర్థం లేదు.

ఈ అసూయ జీవితంలో విచక్షణని కోల్పోయేలా చేసి, ప్రక్కవారు మాత్రం బాగుపడకూడదు అనే ఆలోచనా విధానములోనికి నెట్టివేసి, ప్రశాంతమైన జీవితమునకు భంగమును కలిగిస్తుంది. కాబట్టి అసూయ లేకుండా జీవించుట ద్వారా ప్రశాంతమైన జీవితమును కాపాడుకోగలము.

# ప్రార్థనా శక్తి

## స్తుతి శక్తిని తీసుకొని వస్తుంది

మనం దేవుని స్తుతించినపుడు మరింత బలమును పొందుకుంటాము. మనం విశ్వాసములో వృద్ధి పొందుతాము. ఆయనను స్తుతించుచుండగా మనలను ఓడించడానికి వచ్చిన ప్రతి పరిస్థితి చెదరగొట్టబడుతుంది. అందుకే మనం స్తుతి ఆరాధన సంగీతమును వినుటకు శ్రద్ధ కలిగి ఉండాలి. మనకి అవకాశమున్న ప్రతిసారి అది ఒకటి లేక రెండు నిమిషములైనా దేవుని స్తుతించి ఆరాధించాలి. కొంతకాలం తరువాత స్తుతి మనకి ఎంత సాధారణమై పోతుందంటే ఆయన మంచితనమును, కృపను, దయను గ్రహించిన ప్రతిసారి అసంకల్పితంగానే దేవుని స్తుతిస్తాము.

బైబిల్ గ్రంథములో అబ్రహాముకి దేవుడు కుమారుడిని ఇస్తానని వాగ్దానం చేశారు. “నీ సంతానము ఈలాగు ఉండునని చెప్పిన దానిని బట్టి తాననేక జనములకు తండ్రియగునట్లు, నిరీక్షణకు ఆధారము లేనప్పుడు అతడు నిరీక్షణ కలిగి నమ్మెను. మరియు అతడు విశ్వాసము నందు బలహీనుడు కాక, రమారమి నూరేండ్ల వయస్సు గలవాడై యుండి, అప్పటికి తన శరీరము మృతతుల్యమైనట్టును, శారా గర్భము మృతతుల్యమైనట్టును ఆలోచించెను గాని, అవిశ్వాసము వలన దేవుని వాగ్దానమును గూర్చి సందేహింపక దేవుని మహిమపరచి, ఆయన వాగ్దానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసము వలన బలమునొందెను”

నిరీక్షణకు ఆధారము లేనప్పటికీ అబ్రాహాము నిరీక్షణను ఉంచి, దేవుని వాగ్దానమును నమ్మాడు. తన పరిస్థితులను చూసుకొని తనకు విరోధముగా ఉన్న విషపు పరిస్థితులన్నింటిని బాగా తెలుసుకున్నాడు, అతని శరీరము “మృతతుల్యమైనట్టు” అతని భార్యయైన శారా గొడ్రాలు ఆమె గర్భము “మృతతుల్యము” అని బైబిలు చెబుతున్నప్పటికి అతను ఆశ వదలలేదు. ప్రకృతిపరమైన అసాధారణల మధ్య అబ్రాహాము అవిశ్వాసములో పడిపోలేదు తన విశ్వాసములో విసిగిపోయి దేవుని వాగ్దానమును ప్రశ్నించలేదు దానికి బదులుగా, “అతను విశ్వాసము వలన శక్తిని, బలమును పొందుకొని” దేవుని స్తుతించాడు.

ఆయన చేసిన గొప్ప కార్యములను లెక్కించుటయే స్తుతించుట. మనము స్నేహితులతో, లేక వేరే ఎవరితోనైననూ దేవుని అద్భుత కార్యములను గురించి మాట్లాడుతున్నట్లైతే, మనం ఆయనను స్తుతిస్తున్నాము. నిజానికి దేవుడు ఇటువంటి సంభాషణలను ఇష్టపడతారని ఆయన వాటిని వినినప్పుడు వారికి జ్ఞాపకార్థముగా ఒక

గ్రంథం వ్రాసుకుంటాడని బైబిలు చెప్తుంది (మలాకీ 3:16) మన సణుగులు, సాధింపులు లేక ఫిర్యాదులు కాదు గానీ మన పెదవులపై ఆయన స్తుతి ఉన్నప్పుడు మనం మాట్లాడిన మాటలను ఆయన వ్రాసుకుంటాడు.

మనం చెప్పే ప్రతి మాట ఆయన వింటున్నాడు. మనం చెప్పకపోయినప్పటికీ మన హృదయములలో ఏమి ఉన్నదో ఆయనకు తెలుసు. మనం ఏమి మాట్లాడాలని ఆయన కోరుకుంటున్నాడు? ఆయన ఎంత గొప్పవాడో! ఆయన ఎంత అద్భుతమైన వాడో! ఆయన చేసిన అద్భుత కార్యములు, ఆయన ఏమి చేయగలడో? నిజానికి ఆయన ఏమి చేస్తున్నాడో మనకు తెలియనప్పటికీ ఆయన ఏమి చేస్తాడో! ఇవన్నీ చెప్తూ ఆయనను స్తుతించాలని ఆయన కోరుకుంటున్నాడు.

ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము

వధింపబడిన గొర్రెలను, మేకలను బలపీఠముపై ఉంచవలసిన అవసరం లేని క్రొత్త నిబంధనా కాలములో మనం ఉన్నాము. వాటికి బదులుగా దేవుడు మన పెదవుల నుండి సరియైన మాటలు, ఆయన సింహాసనమును బలిగా, కానుకగా చేరడం ఆయన కోరుకుంటున్నాడు. పాత నిబంధనలో జంతుబలుల ధూపం, సువాసన ఎలా ఆయన సింహాసనం ఎదుటికి చేరాయో, నేడు మన హృదయముల నుండి స్తుతులు ఆ విధంగా ఆయనను చేరుతాయి. హెబ్రీ 13:15 నందు ప్రభువు ప్రస్తుతం నేను కోరుకునే బలి, కృతజ్ఞతతో నాకు అర్పించు జిహ్వాఫలమని నిజముగా చెప్పుచున్నాడు.

మన కొరకు ఆయన చేస్తున్న ప్రతి గొప్ప విషయమును ప్రజలకు చెప్పవలసి ఉన్నది. ఆయనకు కృతజ్ఞతలు చెల్లిస్తూ, మన ప్రేమను తెలుపవలసి యున్నది. మన నోటితోను, హృదయములలోను "ప్రభువా నేను నిన్ను ప్రేమిస్తున్నాను" నా జీవితములో నీవు చేస్తున్న వాటన్నిటికై వందనములు. ప్రతి పరిస్థితిలో అన్నిటిని నా మేలుకై సమకూర్చుతున్న విధానమును బట్టి వందనములు అని చెప్తూ దినములు గడపవలసియున్నది. మనం దేవునిని అన్ని విషయములలో గుర్తిస్తూ నిరంతరంగా స్తుతియాగము అర్పించువారముగా ఉండవలసియున్నది.

సేకరించబడింది (జాయిస్ మేయర్)

# లోయలు




## ఉప్పు లోయ

ఇది మృతసముద్రమునకు దక్షిణముగా ఉండు లోయ. అచట ఒక ఆమడ పొడవుగా నుండు లోయయు దాని ప్రక్కన ఉప్పు గనులుండు దిబ్బలును గుట్టలును గలవు. ఈ లోయలేనే దావీదు ఎదోమీయుల మీద గొప్ప జయమను పొందెను. రాజైన అమజ్యా కూడ ఇదే లోయలో ఎదోమీయులను బహుగా ఓడించెను.

## ఏలా లోయ



ఇశ్రాయేల్, ఫిలిష్తీయ వారి సరిహద్దు దగ్గర బేత్లేహేముకు పశ్చిమంగా ఉంది. సౌలు, ఇశ్రాయేలు వారు సమకూడి ఏలా లోయలో మకాం వేసి ఫిలిష్తీయ వాళ్ళను ఎదిరించడానికి సైన్యవ్యూహం ఏర్పరిచారు. ఒకవైపు ఉండే కొండ మీద ఫిలిష్తీయ వాళ్ళు, మరొకవైపు ఉండే కొండ మీద ఇశ్రాయేల్ వారు ఉన్నారు. వారి మధ్య ఒక లోయ ఉంది. అప్పుడు ఫిలిష్తీయుడైన గొల్యాతు ఇశ్రాయేలు సైన్యములను సవాలు చేయగా దావీదు విని ఈ లోయలో గొల్యాతును జయించెను.




# బైబిల్ క్విజ్ -29

(ప్రకటన గ్రంథము)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** తన మొదటి ప్రేమను వదిలివేసిన సంఘము ఏది?

**2.** పట్టణ ప్రాకారపునాదులను అలంకరించడానికి వాడబడిన పన్నెండవ రత్నము పేరేమిటి?

**3.** తుయతైర సంఘములో ప్రవక్త్రినని చెప్పుకొనుచున్న స్త్రీ పేరేమిటి?

**4.** ఎన్ని సం॥ల పాటు అపవాది బంధించబడతాడు?

**5.** యూదా గోత్రపు సింహము ఎవరు?

**6.** ఒక్క గడియలోనే నాశనమైన మహాపట్టణము ఏది?

**7.** ఏ మహానది వద్ద నలుగురు దూతలు బంధించబడ్డారు?

**8.** ఏ సంఘము దేవుని వాక్యమును గైకొనినది?

**9.** నులివెచ్చని సంఘముగా పేర్కొనబడిన సంఘము ఏది?

**10.** మరణము వరకు నమ్మకముగా ఉండువానికి ఏ కిరీటము ఇవ్వబడుతుంది?

**ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఆగష్టు 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు సెప్టెంబరు 2013 పత్రికలో ప్రచురించబడతాయి.**

**పంపవలసిన చిరునామా - ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070**

**<u>బైబిల్ క్విజ్ - 28 జవాబులు</u>**

1. 12 కాపులు (22:2)
2. అబద్దోను (హెబ్రీలో) అపొల్లుయోను (గ్రీసులో) (9:11)
3. పత్మాసుద్వీపము (1:9)
4. మాచపత్రి (8:10,11)
5. నూతన యెరూషలేము పట్టణము (పరలోకము) (21:23)
6. యోహాను (10:10)
7. ఆసియా (1:4)
8. ప్రభువును స్తుతించుడి (హల్లెలూయ) (19:1)
9. సమస్త పక్షులను (19:18)
10. 666 (13:18)

**బైబిల్ క్విజ్ - 28 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపినవారి పేర్లు:**

కోమలి, రాజు, ఫ్లోరెన్స్‌రాజు, పూజిత, షీబా, జి.రాణి, త్రినాథ్, సి.హెచ్.పాల్‌రాజ్, ఎస్తేరు, సుధారాణి

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జూలై – ఆగష్టు

**భాగ్యలత:** శారమ్మ, సంధ్యారాణి, సాంబశివరావు, నిఖిల్, రమ్య(మార్యాలగూడ), అక్షయ, శ్రీలక్ష్మి, మాధవీలత, రమేష్‌బాబు, ఎస్తేరు, గోపీచంద్, రజని, సరస్వతి, ఇందిరమ్మ, వినీత, సాత్విక్, గంగాధర్, పద్మిని, హరిబాబు, రూఫస్, గురుస్వామి, ప్రశాంత్‌వర్మ, బుజ్జి, దుర్గాప్రసాద్, రామకృష్ణ,రాజేష్, వినయ్, శ్వేత, పాపమ్మ, షర్మిల, నవీన్, శ్రావణి, అనంతలక్ష్మి, విశ్వాస్, సుగంధ్, మణిమ్మ, కిషోర్‌కుమార్, ప్రణీత, పవన్‌కుమార్, స్పర్జన్, రత్నం, సుశీల్‌చంద్ర, దుర్గ, ప్రమోద్, ప్రశాంత్, ప్రభాకర్, విజయ్‌రాజు, ప్రతిభ, ప్రసాద్, శాంతమ్మ, అనూరాధ, స్ప్లెన్‌డిడ్ నెహెమ్యా, ఆవని, సుబ్బారావు, పాల్‌వినయ్, ప్రకాష్, కీర్తి, యెషయా, షారోనుబాబు, ప్రసాద్, రమ్యవర్మ, భానుప్రకాష్, సుజానా, దినకరన్, బ్యూలా, విజయలక్ష్మి, నాంచారమ్మ, దివ్యవాణి, తరుణి, పాపారాణి, కావ్య, మణికంఠ, మాధవి, రూత్‌ప్రమీలరాణి, రాజేశ్వర్రావు, హరీష్, విమలాగ్రేస్, గణేష్, వాణి, జ్యోతి, పర్ణిక, జోసఫ్, రమేష్‌కుమార్, వీణ, సుశాంత్, సుభాష్, సైదులు, శిరీష, ఉన్నత్, శ్రీకాంత్,ఆశ్రయ్, రత్నకుమారి, జ్యోతి, సురేష్, రమాదేవి, శ్రీనివాసరావు, అరుణ, ప్రసన్న, రాజశేఖర్, ప్రసాద్, సంతోష్, హనీ, ప్రకాష్,సురేష్

**చింతల్:** **ప్రశాంతి,** జీవన్, గణేష్, అఖిల, కోమలి, రవిబాబు, వెంకటేశ్వర్రావు, తేజస్విని, శ్రీనివాసరావు, నరసింహ,షైనీ, విజయ, సుధాకర్, శిల్ప, సోనీ, సుమంత్, పరిశుద్ధరావు, రాము, దివ్య, ఆనంద్‌పాల్, జశ్వంత్‌రావు, నాగాంజనేయులు, శివ, భగత్‌వర్మ, ప్రభాకర్, అజయ్‌కుమార్, వెంకటలక్ష్మి, శ్యామ్‌కుమార్, నాగరాజు, వీణ, కాలేబు, విజయ, దీపిక, సత్యం, దీవెన, నిరీక్షణ్, వెంకటరమణ, అరుణ, శ్రీనివాస్, ఆనంద్‌బాబు, షీబారాణి, చిట్టెమ్మ, విజయ

**అనాజ్‌పూర్:** థామస్‌పీటర్, నీలిమ, కిరణ్, స్వాతి, కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్, సంజీవ్, షాలోమురాజు, జాన్సన్, సిద్ధు, మణి, సౌజన్య, విజయలక్ష్మి

**ఇ.సి.ఐ.యల్:** ప్రేమ్‌కుమార్, మాధవి, సుకుమార్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227





2013 మే, 6,7,8వ తేదిలలో
వనస్థలిపురంలో జరిగిన
సువార్త మహా సభలలో
వేలాదిగా పాల్గొని దేవుని
దీవెనలు పొందుకున్నారు.



**2013 మే, 6,7,8వ తేదిలలో వనస్థలిపురంలో జరిగిన**
**సువార్త మహా సభలను దేవుడు ఆశీర్వాదకరంగా జరిగించారు.**



# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras